మా కందరికీ బహుమతులు బ్బాబ్డుకన్యకే పంచిపెట్టింది. నాకు సులోచనాలూ, మంచి కెమిరా బహుమానంకింద వచ్చి నవి. వటీరావుకు సెక్సుబుక్కుల దొంతరా, నిలువుటద్దమూ బహుమానాలు.

బ్బాబ్డుకన్యక—"జాతీయగీతం" అంది. అందరమూ లేచాము. ఆడవాళ్ళందరూ అవ్యక్త మధురకంఠాలతో పాడారు—

"జనగణమన అధినాయక జయ హే, భారతభాగ్యవిధాతా!"

# మిస్సుల బహూమానం

౧

క్లబ్బునుంచి వటీరావు ధుమధుమలాడుతూ యింటికి రావడ మనేది సామాన్య ధర్మంకాదు. కాని యింటినుంచి ధుమధుమ లాడుతూ క్లబ్బుకు వెళ్లడమే సామాన్యధర్మం. ఆనాడుమాత్రం తద్వ్యతిరేకంగా జరిగింది. ఇట్టి విశేషధర్మానికి కారణమేమిటో ఊహించలేకపోయాను. నాకుమాత్రం యిది అనుకూలంగానే ఉన్నది. ఎందువల్లనంటే ఇట్టి చర్యవల్ల మాకు అన్యోన్యం

ఎక్కువనడం ఒకటి, పటీరావుకు క్లబ్బుమీద విముఖత్వం కలగడం రెండు. "వెల్, డార్లింగ్ ఏమిటి సంగ" తన్నాను చెయ్యి జాపి.

నా చెయ్యి పట్టుకొని షేక్ చేసి తన చేతిసంచీ, పొట్టిగొడుగూ నా చేతికిచ్చి సోఫామీద కూర్చుంది. సంచీ, గొడుగూ పటీరావు కాబినెట్ మీద పెట్టి వచ్చి సోఫామీద ఆవిడ పక్కనే కూర్చున్నాను. పటీరావు ధుమధుమ లాడుతూనే తన ఎడమ చెయ్యి నా వళ్ళో పడేసింది. ఆ చేతి రిష్టువాచీ నెమ్మదిగా విప్పుతూ, "వెల్, డార్లింగ్" అన్నాను మళ్ళీని.

"మా సలహా అక్కరలేదట. మా ప్రమేయం అక్కరలేదట. తామే నిర్ణయించుకుంటారుట తమ కార్యక్రమం. నిర్ణయించుకోమను—ఎవరిక్కావాలేమిటి? పోనీ క్లబ్బు యూనివర్సరీగదా, అందరికీ కావలసిందేగదా అని మేము సహాయం చేస్తామన్నా, సలహా యిస్తామన్నా, మా సహాయం, సలహా వాళ్ళకేమీ అక్కరలేదుట—పోనీ అక్కర్లేకపోతే వాళ్ళకర్మాన్ని వాళ్ళేపోతారు. మాకేమైనా కావాలన్నా మా వాళ్ళకొచ్చే బహుమతులు—" ఈ విధంగా పటీరావు ధోరణి సాగిస్తోంది. దీనికి తాడూ బొంగరం నాకేమీ కనిపించడంలేదు. అన్నానుగదా, "ఎవళ్ళు వాళ్ళు పటీ, మైసోల్?"

"ఎవళ్ళా? ఆ మిస్సులు; మాకే ప్రతీయేడూ బహుమానా లిస్తున్నారుట; వివాహంకాని మిస్సులను గౌరవించడానికిబదులు తృణీకరిస్తున్నామట; ఈ యేటి బహుమానాలు వివాహితల కివ్వడానికి వీల్లేదట; అట్లా యిచ్చేమాట్లైతే తాము సత్యాగ్రహం చేస్తారుట; ఈ యేటి బహుమానం ప్రత్యేకంగా అవివాహితలకే యిచ్చితీరాలిట."

"ఇస్తామన్నారా, పోనీ"

"ఇయ్యక మేమే అన్నిబహుమతులూ, ఎల్లకాలం బావుకొంటామన్నామా? కావలిస్తే మీరే పుచ్చుకోండి అన్నిబహుమతులూ; మేమేమీ కోరుకోని, సత్యాగ్రహం చేస్తామని బెదిరించి తెచ్చుకోలేదు అన్నాము."

"న్యాయంగానే ఉన్నది"

"న్యాయంగానే ఉందా? ఎప్పుడూ మీరింతే. గుళ్ళో లింగాల్లాగ కూచునే యీ మిస్సులకు బహుమానాలెందుకో ఆలోచించారా?"

"పోనిద్దూ, అమాత్రమేనా వాళ్ళను చూస్తేగాని వాళ్ళు బెంగపెట్టుకు పోతారు- భర్తలు లేనందుకు బహుమానాలేనా చూచుకొని సంతోషించవద్దూ."

"అందుకనే యిస్తామన్నాము. ఇచ్చినా ఇంకా మమ్మల్ని చూస్తే వాళ్ళకు పీకదాకా కోపం ఎందుకో? ఈ యేటి బహు

మానం సరే, మీరే తీసుకోండి. కాని ఎందుకు బహుమానం యివ్వడమో తేల్చుకోవద్దా? తేల్చండి—అన్నాము. అంటే ఆ సంగతి మాపట్టుకు మేము తేల్చుకొంటాము గాని మీతో చెప్పము—అన్నారు"

"ఎందుకో!"

"వివాహితలతో చెప్తే రహస్యం దాగదుట, భర్తలతో చెప్పేస్తారుట—అందుకని మాతో చెప్పరుట! మే మెందుకు చెబుతామమ్మా అట్టిరహస్యాలు; మాకుమాత్రం తెలియదు టమ్మా, ఇదివరలో జరిగిన ఉత్సవాలకి మీ సలహాకూడా మేము తీసుకున్నాముకాదా! మమ్మల్ని ఎందుకు వేరుచేస్తారమ్మా అంటే వాళ్ళు భీష్మించుకు కూర్చున్నారు. మాతో చెప్పరుట—పోనీ చెప్పకపోతే దాచుకోమనండి. ఆ బహుమతులేమిటో ఆమిస్సులే పుచ్చుకోమనండి—"

"వాళ్ళల్లో వాళ్ళే ఏదో పందాలు వేసుకోవడమో, వేషాలు వేసుకోవడమో ఏదో చేసుకొంటారు కాబోలు—వాళ్ళు, సరదాపడుతున్నారు—వాళ్ళ సరదా మీరెందుకు పాడుచెయ్యాలి?"

"అందుకనే వాళ్ళయిష్టం వాళ్ళది, వాళ్లకర్మం వాళ్ళది అని ఊరుకొన్నాము."

"మూడేళ్ళ బహుమతులు నీకు వచ్చాయిగదా—పోనీ యీ యేటి బహుమానం వాళ్లు పుచ్చుకొంటేమాత్రం ఏం?"

"నాకు బహుమానా లొచ్చాయని అందరికీ కడుపుబ్బగానే ఉంది. ఈ మేటి బహుమానం మాత్రం వాళ్ళకి దక్కనిద్దునా ఏమిటి?—మామూలాన్నిగాని."

"ఉరిపిడుగు పీరిసెట్టిమీద పడిందన్నట్లు—మధ్య నేనేంచేశాను; నీకేమేటి బహుమానం రాకుండా?"

"మిస్సుల్నే పెళ్ళిచేసుకోకుండా ఉంటే నేను మిస్సుగానే ఉందును. అప్పుడు వాళ్ళకీబహుమానం దక్కనిద్దుననుకొన్నారా?"

"ఆమాట నిజమే—కాని తీరా కాలుజారింతరువాత చేసేదేమిటి? పెళ్ళి చేసుకొన్నావు కాబట్టి మూడు బహుమానాలొచ్చేయి— ఒకటిపోతోంది—మొత్తంమీద నామూలాన్ని నీకు లాభమన్న మాటేగదా"

"మీరు నాతో మాట్లాడకండి, ఎప్పుడూ, కుతర్కాలే!"

"అయితే మిస్సులకు బహుమానాలెందుకో తెలియదన్న మాట; క్లబ్బు మెంబర్లయిన మీకుకూడా తెలియదన్నమాట-పాపం!"

"మీరు చెప్పిపోడవ నక్కరలేదులెండి. ఈ పాడుబహుమానాల కెవ్వరూ ఆశించలేదులెండి. వాళ్ళనే పుచ్చుకోమనండి" అంటూ వటీరావు లేచింది. రిష్టువాచీ దాచుకోమని యిచ్చాను. పుచ్చుకొని తనగదిలోకి వెళ్ళిపోయింది.

౨

అవివాహితలందరూ ప్రత్యేకంగా తీర్మానాలు చేసుకొన్నారు. ఆ తీర్మానాలేమిటో ఏవిధంగా ఆచరణలో పెడతారో వివాహితలకు ఎంతమాత్రమూ తెలియదు. తెలిసికోడానికి అనేకవిధాలుగా వాళ్లు ప్రయత్నించేశారు. కాని లాభించిందికాదు సరిగదా, వివాహితలందరినీ వైరివర్గంలో చేర్చేరన్న విధంగా మిస్సులు ప్రవర్తించ మొదలుపెట్టారు.

ఆరోజునుంచీ మిస్సులొక గుంపుగానూ, మిసెసు లొకగుంపుగానూ ఏర్పాటై వీరిమీద వారూ, వారిమీద వీరూ నేరాలుచెప్పుకోవడం మొదలుపెట్టారు. పైకి అన్యోన్యంగా ఉన్నట్లు కనిపించినప్పటికీ లోలోపల వైషమ్యములు పెరుగుతూన్నట్లు ప్రవర్తిస్తున్నారు.

వటీరావుమీద మిస్సులందరూకలిసి ఒకనేరం మోపారు. ఒక స్కేండల్ లేవనెత్తారని వటీరావు నాతో అన్నమాట. అదేమిటంటే:—వటీరావు నిత్యమూ తనభర్తని చీరకొంగుకు కట్టుకు తిప్పుకుంటుందిట. తన చెప్పుచేతలలో ఉండక భర్త తిరగబడ్డట్లయితే చిత్రవధ చేస్తుందట. స్వతంత్రమన్నమాట అతగాడి కెంతమాత్రమూ యియ్యదట. తాను స్వతంత్రంకోసం ఎప్పుడూ యింటా, బయటా పాకులాడుతూ ఉంటుందట.

ఇంతాచేసి ఇంటివద్ద రహస్యంగా భర్తచేత లెంపకాయలు అడపాతడపా అప్పుడప్పుడు తింటూంటుందట. ఇదీ నేరము.

ఈ నేరం మొదటిభాగం వటీరావుకు కోపకారణం కాలేదు సరిగదా అది ఒక స్తోత్ర భాషణంగానే ఆవిడ భావించింది. ఇక రెండవభాగం విషయమై ఆవిడకు ఒళ్ళు తెలియనంత కోపం వచ్చింది.

తాను—యమ్మే ప్యాసైన తాను—కల్చరుక్లబ్బులో మెంబరైన తాను—స్వతంత్ర వాయువులు నిత్యమూ పీలుస్తున్న తాను—తాను మొగుడుచేత లెంపకాయలు తింటోందా? ఈ స్కాండల్ ప్రచారములో పెట్టినవాళ్ళెవళ్ళో తెలుసుకు తీరతానంది. వాళ్ల గుట్టూ, మట్టూ ఊడలాగి ప్రపంచానికి వెల్లడిచేస్తానంది. వాళ్ళను—ఆ మిస్సులను—తిట్టడానికి ప్రత్యేకంగా ఒక వారపత్రిక పెడితే బాగుండదా అని సలహాఅడిగింది. అందుకోసము ఎంత ఖర్చు అవుతుందో ఎస్టిమేటు వేయించుకు రమ్మంది నన్ను.

"ఎవరిదగ్గిర వేయించుకు రమ్మన్నావు నన్ను" అంటే.

ఎవరైనా మోడరన్ గ్రంథకర్తలనుగాని, భావకవులనుగాని అడిగి ఎస్టిమేటు వేయించుకు రమ్మన్నది. ఆ భావకవులకు ఆ పాపం, పుణ్యం ఏమీ తెలియదని నేనంటే "షటప్, మీకు తెలియదు; నేచెప్పినట్లు చేయండి" అంది.

అంతేకాకుండా పదిమంది భావకవుల్ని పోగుచేసి మనపా ర్టీలో చేర్చమంది. కావలిస్తే వాళ్ళకి కాఫీలూ, సిగరెట్లూ ఇవ్వ చ్చునులెండి అంది.

ఇంతవరకూ సౌమ్యంగానే జరిగింది. స్కాండల్ లేవనెత్తిన వారిని శిక్షించవలసినదే! తదనుగుణంగా శిక్షామార్గాలు వెద కవలసిందే! కాని ఏ పాపం, పుణ్యం ఎరగని నామీద శిక్ష ప్రయోగమైతే అది నాజాతక మహిమ అనుకోవాలా, డెస్టినీ అనుకోవాలా, సామాన్య కుటుంబధర్మం అనుకోవాలా?

ఆ స్కాండల్ నావల్లనే లోకంలోకి పాకిందనిన్నీ, లేకపోతే మిస్సులకు ఎట్లా తెలియవచ్చిందనిన్నీ ఆవిడ నామీద విరుచు కుపడింది. నేనన్నానుగదా, "నావల్ల ఈ దుర్వార్త పాకడానికి కారణం ఉండవద్దా? నేను లెంపకాయలు కొట్టడం, నీవు తినడం సంభవిస్తేగద ఈ వార్త అంటూ ఒకటి బయటికి పాకిఉంటుంది? అటువంటి పని నేనెప్పుడేనా చేశానా?"

"చెయ్యాలని ఉబలాటంగా ఉందా ఏమిటి మీకు? చెప్పండి అదేమిటో."

"అదిగాదు పాయింటు. అసత్యవార్తలు వాళ్ళు ప్రకటించి నపుడు ఆ బాధ్యత నామీద ఎందుకు తోస్తావు?"

"అసత్యమని మీకూ, నాకూ తెలుసును. లోకానికి ఏం తెలుసును."

"అందుకు నే నేం చెయ్యను?"

"మీమూలాన్నే యీ దుర్వార్త లోకంలో పాకింది. భర్తంటూ ఒకడుండబట్టిగదా భార్యను కొట్టడమనే కార్యం తటస్థిస్తుంది. కాబట్టి మీవల్లనే యీ చెడ్డపేరు నాకు వచ్చింది.

"బాగానే ఉంది. భర్తంటూ ఒకడున్నాడంటే తనకుతానై ఉండలేదుకదా! భార్యంటూ ఒకత్తె ఉండబట్టి, భర్తంటూ ఒకడుండడం తటస్థించింది--"

"అదే నేనంటూంట- భర్తంటూ మీరు పేరుపెట్టుకొన్నారుకాబట్టి ఈ నేరానికి మీరు సమాధానం చెప్పవలసిఉంటుంది- లేదా"

"పోనీ ఆ పదవినుంచి తప్పుకోమంటావా? ఈ కష్టాలు నీకూ, నాకూ ఎందుకు?" అన్నాను నవ్వుతూ.

"తప్పుకొందురు గాని లెండి. ముందర దీని మాటేమిటో చెప్పండి."

"నేనేమిటి చెప్పేది? నేనెప్పుడూ నిన్ను కొట్టలేదు. కొట్టను. ఇక లోకు లేమనుకుంటే నాకేం కావాలి"

"మీ కక్కర్లేదుకాని నాక్కావాలి"

"అయితే ఏమంటావు?"

"నా చెప్పుచేతలలో మీరు ఉంటారని లోకంలో చెప్పుకోడం మీరు వినిఉంటారు, ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సు మీరు ఫీలైఉంటారు. అందుకోసం యీ స్కాండల్ మీరే ప్రచారంలోకి తెచ్చి ఉంటారు."

"రామ రామా"

"లేకుంటే యీ మిస్సులకెలా తెలియవచ్చింది. వెనక మీరు నాకో కంట్రాక్టు రాసియిచ్చారు—సౌందర్య పోషణం విష యంలో—జ్ఞాపకం ఉందా? నాపట్ల ఎప్పుడూ యీవిధంగా ప్రవ ర్తించననీ, నన్ను ఇన్‌సల్‌టు చేయననీ వ్రాసియిచ్చారు.—దీని కేమి సమాధానం చెప్తారు?"

"నేనేమీ నీ విషయంలో అన్యాయంగా ప్రవర్తించలేదు— తరవాత నీయిష్టం"

"మీ మొహంచూస్తే నాకు మండుకొస్తోంది—నేను మొగు డుచేత లెంపకాయలు తిన్నానా? నావాళ్ళే నాకు శత్రువుల య్యారా? నారాత యిలాగ రాసిఉందా? నాభర్తే నామీద స్కాండల్సు వ్యాపింప చేస్తూంటే—" అని ఏడవడం మొదలు పెట్టింది. అక్కడ ఇక నిలిచి ఉండడం మంచిదికాదని బయటికి వచ్చాను.

3

మనస్సంతా చెడిపోయింది. సంసారమంటే విరక్తి పుడు తోంది. "ఇంటిలోని పోరు యింతింత కాదయా" అన్న వేమన్న పాపం ఇంటిపోరు ఎంత అనుభవించి ఆమాట వ్రాసిఉంటాడో అనిపించింది. మనస్సు విరిగిపోయింది. చనువిచ్చి మాట్లాడేవాళ్లు సైతం ఎవళ్ళూ లేరనిపించింది.

## మిస్సుల బహుమానం

కారెక్కి నెమ్మదిగా వెడుతున్నాను. నాదుఃఖాన్ని నేను దిగమింగుకుంటూ వెడుతున్నాను.

ఎదురుగా పెదవాడ వంతెన కనిపిస్తోంది. చల్లగా గాలి కొడుతోంది. సముద్రపుకోళ్ళు పర్రలమీద నిలిచి మురిగి కంపు కొడుతున్నాయి. పాలపిట్ట పురుగులకోసం ఎగురుతూ 'ఆకలి' 'ఆకలి' అని అరుస్తోంది. పెదవాడ వంతెన ఎక్కింది కారు. ఎదురుగా వంతెన మలుపులో ఒక సైకిల్ ఎదురు రావడం కనిపించింది. అది ఆడసైకిలు. ఎవరో విద్యావతి తొక్కుకు వస్తోంది కారు ముందుకుపోయి మలుపు తిరిగింది. సైకిల్ వంతెన ఎక్కబోతూ కారుకు అడ్డు వచ్చింది.

కారు ఆపాను. నేను తొందరగా కిందికి దిగాను. సైకిల్ కారు మడ్‌గార్డుకు కొట్టుకొని నాకాళ్ళలో చిక్కుకొంది. నేనుపడ్డాను. మోకాలు కొట్టుకుపోయింది. విద్యావతి మోచేతిమీద పడింది. ఆవిడ మోచెయ్యి కొట్టుకుపోయింది. నేను లేచాను. ఆవిడలేచి నిలబడి దులుపుకుంటూ, "హల్లో, మిష్టర్ రావ్" అంది.

నేను దులుపుకొంటూ, "హల్లో మిస్ హాల్, సారీ, ఆఫులీ సారీ, దెబ్బ తగలలేదుగదా" అన్నాను.

"లేదులెండి" అని రక్తంచిమ్మిన మోచెయ్యి చూచుకొంటూ "ఈమాత్రం దెబ్బకి లెక్కలేదులెండి. మగవాళ్ళకు మల్లె మానవతులము మేము అంత గోలచెయ్యాములెండి. పాపము. మీకేమీ దెబ్బ తగలలేదుకదా, సారీ" అంది. కొట్టుకుపోయిన

మోకాలు రాసుకొంటూ అన్నానుగదా, "గొప్ప యాక్సి డెంటు తప్పింది! పాపం, మీ మేకప్పంతా చెడినందుకు పార్డన్; మళ్ళీ టాయిలెట్ చేసుకోవాలి కాబోలు, సారీ."

"మోకాలు కొట్టుకుపోయిందా పాపం, రండీ, డాక్టరుదగ్గ రకి తీసుకుపోతాను. డ్రెస్ చేయిస్తా."

"ఎందుకండీ, మిస్ హాల్, ఈమాత్రానికి డ్రెస్సింగు—అదే పోతుంది"

"నో, నో, మిస్టర్ రావు, అది సెప్టిక్ అవుతుంది—రండి వెడదాం రండి."

"మీకు కారులో లిఫ్టు ఇవ్వవచ్చునా?"

"ఈ సైకిల్ ఏమిచెయ్యమన్నారు? నేను సైకిల్ మీద ముందు పోతూ ఉంటాను. మీరు మెల్లిగా కారు నావెనకే నడిపించుకు రండి. నామీదకుగానే కారు పెట్టరుగద!"

"ఓ, నో, మిస్ హాల్; నేను బ్రూట్ను అనుకొన్నారా."

"నో మిస్టర్ రావు. మీరు స్వీట్, లవింగ్, ఇనోసెంట్ డార్లింగ్."

"థాంక్సు" అన్నానుగాని నా మనస్సుకు షాక్ తగిలింది. మనస్సులో కమ్మిన చీకట్లు విచ్చిపోయాయి. బెంగపోతోంది, దుఃఖం పోతోంది. ఇంతకీ "సింపతెటిక్ స్త్రీ" పురుషుడికి ఎంత ఉపకారం చెయ్యగలదు అనిపించింది.

ముందు మిస్ హాల్ సైకిలుమీద పోతోంది. వెనక నేను నెమ్మదిగా కారు నడుపుకుపోతున్నా. సైకిల్ ఆగింది. హాల్ దిగి అక్కడి ఇంటిలోకి గబగబ వెళ్ళింది. నేను కారు ఆ యింటి ముందు ఆపిచూచాను. అక్కడ వ్రాసిఉన్నది పెద్దబోర్డు.

"డాక్టరు ఎ. సూయ" అని.

"కమాన్ రావ్" అని లోపలినుంచి హాల్ పిలుపు. లోపలికి వెళ్ళాను.

మిస్ హాల్ నాచెయ్యి దొరకపుచ్చుకొని ముందుకు లాక్కుపోయి ఒక బొబ్డుజుట్టు పసిడిబొమ్మ దగ్గిర నిలబెట్టి, "ఈమె డాక్టరు ఎ. సూయ అని మీకు ఇన్ట్రడ్యూసు చేయడానికి నాకు చాలా సంతోషంగాఉంది" అనిన్నీ "ఈయన వటీరావు భర్తగారైన మిస్టర్ రావు అని మీకు ఎరిగించుటకు నాకు చాలా సంతోషంగాఉంది" అనిన్నీ చెప్పింది. కరపీడనాదులు యథాక్రమంగా జరిగాయి. మేమంతా కుర్చీలమీద ఆసీనుల మయ్యాము. మిస్ హాల్ జరిగిన ప్రమాదం సంగతి చెప్పింది.

ఆమాట వినడంతోనే డాక్టరు సూయ కుర్చీమీదనుంచి ఎగిరి గంతువేసి లేచి నాచెయ్యిపుచ్చుకొని డ్రెస్సింగురూముకు లాక్కుపోయి స్వయంగా మోకాలిదెబ్బకు కట్టుకట్టింది. మళ్ళీ రేపువచ్చి డ్రస్ చేయించుకోమంది. థాంక్సు చెప్పేను. "యూ. ఆరే స్వీట్ డియర్" అని నా వీపుమీద చరిచింది. నేను మళ్ళీ వచ్చి కుర్చీమీద కూర్చున్నా.

మిస్ హాల్ యీ లోపుగా చెదిరిపోయిన ముంగురులు దువ్వుకొని చిన్న అద్దంలో ముఖం చూచుకొంటూ ఫేస్ పౌడరు ముఖానికి అద్దుకుంటోంది. ఆవిడకూడా తన దెబ్బకు కట్టు కట్టించుకోడానికి డ్రెస్సింగు గదిలోకి వెళ్ళింది.

ఇద్దరూ ఆగదిలో గుసగుస లాడుకొంటున్నారు. నవ్వుకొంటున్నారు. "సింపిల్ లాడ్" అనేమాట నాచెవిని పడింది. క్రమ క్రమంగా వాళ్ళమాటలు నాకు వినిపిస్తున్నాయి. నేను విన్న మాటల సారాంశం యిది.

నాకారు దూరంనుంచే హాల్ చూచిందిట. కారుమీద పడాలని సంకల్పించుకొందిట. ప్రమాదంలేకుండా పడడం ఎలాగా అనుకొందిట—నేను కసిపెట్ట లేకపోయానట. సింపిల్ స్వీట్ డార్లింగునట—

౪

ఇంటికి వచ్చేసరికి వటీరావు ట్రింగా, డ్రెస్ చేసుకొని చిరునవ్వులు కురిపిస్తూ నాకు స్వాగతం చెప్పింది. తాను నన్ను రూడ్‌గా ట్రీట్ చేసిందనీ, నా మనస్సుకు నొప్పి కలిగించిందనీ తన్ను క్షమించమనీ ఎంతో దీనంగా, ప్రాధేయంగా ప్రేమతో నా బుగ్గమీద తనబుగ్గలు ఆనించి ప్రార్థించింది. నాకు ఏనుగును ఎక్కినంత సంతోషం వచ్చింది.

నేను బట్టలు మార్చుకొనివచ్చి ఆవిడపక్క సోఫామీద కూర్చున్నాను.

నేను కారుఎక్కి వెళ్ళిపోయాక తాను మాడరన్ గ్రంథకర్తలకోసం ప్రయత్నంచేసిందిట. ఒక కాఫీహోటల్లో పదిమంది దొరికారుట. వాళ్ళు వారపత్రికకు ఎస్టిమేటు యివ్వలేకపోయారుట గాని ఆమె పెట్టబోయే పత్రిక్కి తప్పకుండా భావగీతాలు వ్రాస్తామన్నారుట. శ్రీమతి వటీరావుగారు సంపాదిస్తున్న పత్రికకు భావగీతాలు రాయడంకన్న కావలసిన గౌరవం ఏమిటన్నారుట! భావగీతాలుకాను తిట్టుగీతాలూ, కథలూ వ్రాయవలసి ఉంటుందంటే అందుకూ సిద్ధమేనన్నారుట. కాబట్టి ప్రెస్సుకువెళ్ళి కాగితాలకీ, అచ్చుకీ, ఎస్టిమేటువేసుకు నన్ను రమ్మంది.

ఇక కారుమీద వెళ్ళి నేనేంచేశానో చెప్పమంది. కాలికి కట్టినకట్టు చూపించాను. ఆదుర్దాగా కట్టుచూచి, బెదిరి, ఎవరు కట్టారీ కట్టంది.

డాక్టర్ సూయ కట్టిందని చెప్పాను.

"అనసూయా?"

"కాబోలు?"

"కొత్తగా వచ్చిందిలెండి ఒకమిస్సు యీవూరు ఈమధ్యని."

అని కట్టువిప్పింది. ఈమాత్రం దెబ్బకు కట్టుఎందుకు అంటూ- ఎందుకొచ్చిందసలీదెబ్బ అని విచారించింది.

జరిగిన సర్వమూ ఆవిడకు నివేదించాను.—

వటీరావు ఆలోచనలో పడింది. నాతో మాట్లాడ్డం మాని నిర్ఘాంతపోయి ఆలోచిస్తోంది.

"స్వీట్ డియర్" "స్వీట్ డార్లింగ్" అన్నారా వాళ్ళు—అని మళ్ళీ ఆలోచనలో పడింది. యాక్సిడెంటు కల్పించారా?"

"ఎందుకలా ఆలోచిస్తున్నావు?" అన్నాను.

"ఎందుకా? చెబతాకాదూ. సాయంత్రం అంతా చెబతాలెండి."

"అయితే క్లబ్బుకు వెడతావా?"

"వెళ్ళను, ఇంటివద్దే ఉంటాను ఈవేళ"

నేను నా పనిమీద పోయి చీకటయ్యాక యింటికివచ్చాను. వటీరావు నాపేరవచ్చిన కవరు తనచేత్తో పట్టుకు కూర్చుంది.

"ఏమిటా కవరన్నాను."

"మీ పేర వచ్చింది. ఇదిగో చూచుకోండి"

"విప్పు, ఇద్దరం చూద్దాములే."

"మీ రహస్యాలు ఏమైనా ఉంటాయేమొ?"

"వటీరావుదగ్గిర నాకు రహస్యాలు లేవనేసంగతి వటీరావుకు తెలియదూ?"

కవరు చింపింది. అందులో ఉత్తరం ఇది.

## ప్రయివేటు

మై డియర్ స్వీట్ డార్లింగ్!

ఉదయాన్ని మీకు తగిలినదెబ్బ మోపుచెయ్యలే దనుకుంటాను. తప్పక మీరు రేపువచ్చి డ్రెస్ చేయించుకోవాలని

డాక్టరు సూయుగారు మరీమరీ చెప్పమన్నారు. మీకు తటస్థించిన ప్రమాదం సంగతి మిస్ లిక్ గారువిని ఇంతవరకూ అన్నం ముట్టలేను.

మీరు రేపు తప్పక రావాలి. నేనూ, సూయూ, లిక్కూ కలిసి మీకు టీపార్టీ ఇవ్వదలచుకొన్నాం. చిన్నపార్టీ. మరెవరినీ పిలవదలుచుకోలేము. అంతవరకూ మీకు నా ముద్దులు. సూయూ, లిక్కూ మీకు మిలియన్ కిసెస్ చెప్పమన్నారు. రేపు వస్తారుగామూ, డియర్ ఇక ఉంటా.

మీ లవింగ్ ఫ్రెండ్
మిస్ హాల్.

పి. యస్.

దీనికి జవాబు రాస్తారు కాదూ? మీ జవాబుకోసం చాతక పక్షినై ఉంటాను. డియర్ ! హాల్.

పి. పి. యస్. తప్పక రావాలి! రావాలి! హా.

ఈ ఉత్తరం దంపతుల మిద్దరమూ చదువుకొన్నాము.

నాకీ ఉత్తరం ఏమీ అర్థంకాలేదు. కారుప్రమాదం అనే బీజంలో పుట్టి యిది—యిది లవ్వా, స్నేహనా—మహావృక్షం అయిపోతోంది. హాలుకు మతిపోతోంది. సూయూ, లిక్కూ హాలుకు ఎందుకు తాళం వేస్తున్నారో. ఇదంతా వటీరావుమీద కసి తీర్చుకోడానికా? వేరే కారణముందా? ఇక నాసంగతో— నా మనస్సు మనస్సులోలేదు. ముగ్గురు మాడరన్ గరల్సు తమంత

తాము వలచివచ్చి ముద్దులు కురిపిస్తూంటే ఏ పురుషుడు తట్టుకోగలడు. కాని వటీరావు డిసిప్లినులో ఉన్నవాడిని కాబట్టైన్నీ, దైవభీతి కలవాడను కాబట్టైన్నీ కొంతవరకు నిగ్రహం అవలంబించ దలుచుకొన్నాను.

ఉత్తరం పూర్తిగా చదివి వటీరావు తెల్లబోయింది. ఆలోచించింది. పళ్ళు కొరికింది మళ్ళీ ఆలోచించింది.

"ఇంతకుముందు హాలు మీకేమీ ఉత్తరాలు వ్రాయలేదు కాదూ?"

"లేదు, వటీ"

"ఆ నూయూ లికున్నానో!"

"వా ళ్ళెప్పుడూ రాయలేదు హనీ"

"తెలిసింది లెండి" అంది.

నా గుండెలలో రాయిపడింది.

" ఏమిటి తెలిసిందంటున్నావు, వటీ"

"ఇప్పుడుకాదు, చెప్పుతాలెండి. రాయండి ఆ ఉత్తరానికీ జవాబు రాయండి"

నేను కాగితం తీసుకొని ఉత్తరం వ్రాశాను.

"శ్రీమతి మిస్ హాల్‌గారికి నమస్కారములు—మీరు దయతో రాసిన ఉత్తరం అందింది. రేపు ప్రస్సింగులో రావలసి

సంత అవసరం కనిపించదు. నాకు తగిలిన దెబ్బ మానిపోతోంది. టీపార్టీకి రాలేనందుకు నన్ను క్షమించండి.——"

వ్రాస్తూన్నది వటీరావుచూచి కాగితంలాగి చింపేసింది. తాను చెప్తూతాను రాయమంది.——

ప్రియివేటు

మై డియర్, పీ, పీ, స్వీట్;

మీ ప్రేమజాబు చూచుకొని పులకించాను. ఆ యాక్సిడెంటులో మీకు ఏమీ షాక్ తగలలేదని భావిస్తాను. నాకు షాక్ తగిలినమాట వాస్తవం. అది డాక్టరు సూయగారి అటెంషన్సు వల్ల అధికమైంది. లీక్ గారి ఉపవాసంవల్ల అది దుర్భరమైంది. కాని మీయొక్కా, సూయా లిక్కుగార్లయొక్క మిలియన్ కిస్సెస్సులలో మునిగిపోయింది. అందువల్ల ప్రమాదమేమీలేదు. నాకు తగిలిన దెబ్బ చాలా చిన్నది. సూయగారి డ్రెస్సింగువల్ల మానిపోయిందనే చెప్పవలెను. కాని అది మానినా మానకున్నా, దెబ్బ ఉన్నా లేకున్నా సూయగారు రమ్మన్నారుకాబట్టి ఆమె ఆహ్వానం ఆజ్ఞగా స్వీకరించి డ్రెస్సింగు చేయించుకోడానికి తప్పక వస్తాను.

నా గౌరవార్థమై సూయా లిక్కుగార్లూ మీరూ ఏర్పాటు చేసిన టీపార్టీకి రాకుండా ఉండగలనా? అందాకా మీకందరికి

నా లవింగ్ కిసెస్.

ఇట్లు. మీ హృదయదాసుడు రావు.

పి. యస్.

చాతకపక్షికి మబ్బుచినుకులు ఎట్లా యివ్వాలో మీరే చెప్పాలి. రావ్.

పి. పి. యస్.

రెక్కలుకట్టుకు తప్పక వస్తా, వస్తా. రా.

ఈ ఉత్తరం రాయించి, వటీరావు కవరులోపెట్టి అడ్రెసు రాయించి, తానే స్వయముగా పంపిస్తానని పుచ్చుకొంది. మర్నాడు ఉదయమే హాలుకు పంపించింది.

వటీరావే స్వయంగా ఇటువంటి ఉత్తరం వ్రాయించడం నాకు ఆశ్చర్యకరంగా ఉంది.

"ఏమిటిదంతా" అన్నాను.

"అర్థం కాలేదూ, మై సింపిల్ హాబ్బీ!"

"కొంత లఘుటీక చెప్పితే అర్థం అవుతుందేమో!"

"మిస్సులు మిస్సుల్ని వలలోవేసి ఈ యేటి బహుమానం కొట్టాలని చూస్తూన్నట్టు నా కనుమానంగా ఉంది."

"ఇల్లాంటి ఉత్తరాలురాస్తే ప్రమాదంకాదూ."

"మిస్సులతో ప్రమాదమా, సిల్లీ"

"మరి వాళ్ళకు బహుమతి రావడానికి నువ్వెందుకు సహాయం చెయ్యడం?"

"గెలిచిన మిస్సులకీ, విక్టిమ్‌కీ కూడా బహుమతు లుంటా యని తోచింది."

"నాకు బహుమతులొద్దు, ఈ గొడవల్లోకి నేదిగను. నేను టీపార్టీకి వెళ్ళను."

"మై పర్స్యూలస్ హాబీ! మీరు వెళ్ళండి. మీకో ప్రయిజు వస్తూంటే పోగొట్టుకుంటారా? నేను పోగొట్టుకోనిస్తానా? కాని చాలా డెలికేటు పరిస్థితులు వస్తవి. జాగ్రత్తగా మాత్రం ఉండండి."

*

మర్నాడు ఉదయాన్ని ఒక డజన్ భావకవులు మా యింటిలో తయారయారు.

"నువ్వుగానే వాళ్ళను రమ్మన్నావా ఏమిటి?" అన్నాను రహస్యంగా పటీరావుతో.

"లేదు, మొర్రో అంటూంటే"

"మరి వీళ్ళు ఎందుకు వచ్చినట్లు?"

"భావగీతాలు తెచ్చి ఉంట్టారు వారపత్రిక్కి."

"వీళ్ళను వదిలించుకోవడం మాట?"

"నాలుగు టీపాట్లూ, షుగరూ, మిల్కూ, రెండు డజన్ల సిగరెట్ పేకట్లూ వాళ్ళముందర పడేస్తాగా."

"తరవాత."

"నాకు పనికివచ్చే భావగీతాలు లాక్కొని పంపిస్తా"

"వారపత్రికే్కా?"

"ఆ ఐడియా డ్రాప్ చేశా. ఇక దాని అవసరంలేదు. మిస్సుల కార్యక్రమం వెల్లడౌతోందిగా! భావగీతాల ఉపయోగం ఉంది లెండి!"

* * *

కవులందరూ టీ తాగి సిగరెట్లు ముట్టించారు. నేనూ వటీ హోస్టులం. మా అనుమతి తీసుకొని వాళ్ళు తమ కాగితాలు తీసి రాసుకువచ్చిన పద్యాలు చదవడం మొదలుపెట్టారు, సంగీతధోరణిలో.

## వి రా శి గీ తం

౧ కవి— కరాళ దంష్ట్రిలు
మరాళ యానం
పరాయికవి మర
మరాలు తింటే
హరా మహాశివ
శిరాలు వంచకు
వరాలు లేవా
కరాలు రావా

# మిస్సుల బహుమానం

౨ కవి—పోరాటం ఊబలాటం
పర్యాటం సంగాతం
బొడ్డుజుట్టుకు పైపైకొప్పు
భావకవికి అరకాఫీ కప్పు
పసుప్పా కుంకుం ఫేస్పవుడర్
కచికా బొగ్గూ టూత్పవుడర్
ఖారాకిల్లీ సోడా సిగరెట్
చేగోడీలూ మైసూర్పాక్

౩ కవి—మధుర మోహన మంజులామ్రాశఫలము
సిరుల తెరదీసి కరిమూన మెరుగుబూసి
ఆహరించిన యెడద నివాళి యిచ్చి
భామినీ కామినీ ఎట్లు బ్రదుక గలను.

౪ కవి—భాసుర దివ్యకోనుల స్వ
భావస్వరోచినిజాంతరంగ కే
లా సిరు అబ్బు నీ వదన
మాధురి గ్రోలని కోకిలమ్మ కా
కాసుర గర్వభంజన వి
కార విదూరనివాత గోష్పతిః
హాస వికారలేఖల స
హాసము గోరితి మంజుభాషిణీ!

౫ కవి—కంకాళంలో కమ్మని పద్మము
శ్మశాన శిఖిలో అగరు ధూపము
ఎముకల గుట్టల కెంపుల తళుకులు
శవజాడ్యంలో చైతన్యం
కొత్త వెలుగు లవి కొత్త విశ్వ మది

నా ప్రేయసి నా ప్రేయసి
నా ప్రేయసి నీ హృదయం
నా కాష్ఠం

౭ కవి___ మబ్బుల్లో నా రాణీ
రబర్బు బొమ్మే కానీ
మోటార్ హారన్ ఊత్తే
బర్రెలు ఉరకడ మెందుకు
ప్రేమలేఖ రాయాలా
మేఘాలే కురియాలా
ఊత్తది పట్టెది డామిట్
కళ్ళ చివర నీ కాంతి
కబళించును నా శాంతి
విశ్వాలే తగలడితే
నే నొక లెక్కా

౮ కవి___ కాలవగట్టున పూలతోటలో
కనిపించెను నా సంపెగ పువ్వు
కొండ శిఖరమున మబ్బులు మోస్తూ
ఎండి పోయినది మోదుగ పువ్వు
అడవుల్లో పులిపాదా లడుగున
పడి తల యెత్తెను తుమ్మి పుష్పము
నా యెదలో చిచ్చెట్టి పోయినవి
ఆ పువ్వీ పువ్వంతా లవ్వే

౯ కవి___ యుద్ధం యుద్ధం
శుద్ధ అబద్ధం
ఖద్దరు బట్టలు
సిద్ధం సిద్ధం

# మిస్సుల బహుమానం

౯ కవి — గోళం గోళం
చుక్కలు చుక్కలు
గ్రహములు గ్రహములు
ఢీ కొంటున్నాయి
వా కొంటున్నాయి
ఊ కొంటావా
అగ్గిజ్వాలలు
ప్రళయ గీతములు
సముద్ర ఘోషలు
చండ మారుతాల్
వీస్తున్నాయా
లేస్తున్నాయా
చూస్తున్నావా
ఉదయ భానుడికి
తుమ్మెద పదములు
తామర పువ్వులు
ప్రపంచమంతా
చైతన్యం

౧౦ కవి — ఆంధ్ర తేజం బేడు వార్ధుల
నుత్తరించిన దాంధ్రుడా
ఆంధ్రవీర్యం బేడుదీవుల
నలముకొన్నది ఆంధ్రుడా
ఆంధ్రగీతం బేడుకొండల
నంటి మ్రోగిన దాంధ్రుడా

ఆంధ్రుడను నేనంచు గుండెల
నదుముకోరా ఆంధ్రుడా

౧౧ కవి— కోకిల కూతకు అర్థం ఏమిటి
ఆకలి ఆకలి సామ్యవాదం
చిలక పలుకులకు వ్యాఖ్య ఏమిటి
ఆకలి ఆకలి సామ్యవాదం
గుళ్లో గంటల గణగణ ఏమని
ఆకలి ఆకలి సామ్యవాదం
భామల హృదయ స్పందన ఏమని
ఆకలి ఆకలి సామ్యవాదం

౧౨ కవి— అంత
కొంత
వంత
చింత
...
ఎంతని
కంతుని
పంతము
రంతులు
......
సంతసమా
ఇంతులకా
అంపటి నా
కింతగతా
......

అంతము లేదా
వంతలు పోవా
శాంతి వినాగా
దాంతి దక్కునా
. . . . . . . . . .
కాంతల యెడదలు
కాంతివంతములు
వింత స్వప్నములు
దొంతర చిక్కులు
. . . . . . . . . . . . .

ఈ విధంగా తాము వ్రాసుకువచ్చిన పాటలూ, పద్యాలూ కవులందరూ చక్కగా చదివారు. వటీరావు ఎక్కడికక్కడ వాళ్ళని ప్రోత్సహిస్తూ, చప్పట్లు కొడుతూ, నవ్వుతూ, 'రైటో' అంటూ ఎంతో మెచ్చుకొంది. వాళ్ళదగ్గిరనుంచి ఆ పద్యాలూ, పాటలూ పుచ్చుకొంది. ఎప్పుడైనా ఒక పబ్లిక్ మీటింగు పెట్టించి వాళ్ళకి తలో టైటిలూ ఇప్పిస్తానంది.

కవులందరూ సెలవుతీసుకు వెళ్ళారు.

వటీరావు ఒక ఒవుండు నోటుబుక్కులో స్వహస్తంతో నా చేత, అవన్నీ వ్రాయించింది. నాచేతే మొదటి పేజీమీద ఈ విధంగా వ్రాయించింది.

ఊహలు

అనే ఈ గ్రంథము ప్రేమతో—

—మిస్ సి. వి. హాల్—

—డాక్టరు డి. ఎ. సూయ—

—మిస్ జి. యమ్. లిక్—

గార్లకు

—వి. జి. రావుచే—

అంకితము చేయఁబడినది"

చివర నాచేత దస్కతు చేయించింది. ఆపుస్తకం తనదగ్గిర పెట్టుకొంది. సమయంచూచి, తానే అది స్వయంగా పంపుతానంది. వటీరావు ఎత్తులు నాకేం బోధపడడం లేదు.

పాపం ఆ భావకవుల పద్యాల కర్తృత్వం నామీద మోపింది. ఎందుకంటే బహుమానం వస్తుందంటుంది. ఈ బహుమానం పిచ్చి మహా పట్టుకొంది వటీరావుకు.

౬

మధ్యాహ్నం తానే నాకు ముస్తాబుచేసి వటీరావు నన్ను కారెక్కించి టీపార్టీకి పంపింది. అయిపోవడంతోనే యింటికిరమ్మంది. నాకోసం కనిపెట్టుకు ఉంటానంది. ఈ టీపార్టీసంగతి వటీరావుకేమీ తెలియదని నన్ను అడిగితే చెప్పమంది. తనకూ,

నాకూ విరోధం వచ్చినట్లుగా కూడా ఆసంగతి మిస్సులు ప్రశం
సిస్తే చెప్పమంది.

*　　　*　　　*

పాపం వటీరావు ఇంటిదగ్గిర కనిపెట్టుకు కూచుంది. గంటలు గడచిపోతున్నాయి. ఎంతకీ భర్త రావడంలేదు. ఆవిడకు ఏమీ తోచిందికాదు ఆ మిస్సుల ఇళ్ళకు వెడదామని బయలుదేరింది. కాని రసాభాసం అవుతుందనీ, వచ్చేపై రిజు పోతుందనీ భయపడింది. రాత్రి పన్నెండు గంటలయింది, ఒంటిగంటయింది.

వటీరావుకు నిజంగా భయం పట్టుకొంది. దడవచ్చింది. తన మీద కోపంకొద్ది తనభర్తను వాళ్ళు మర్డరు చెయ్యరుగదా! అంతపని చెయ్యకపోయినా, ప్రాణాపాయం కలిగించకపోయినా అంతమట్టుకు వచ్చేటట్టు చేస్తారేమో? ఈ మిస్సులు ఎంతకైనా తగుదురు. అందులో సూయ డాక్టరుకూడాను. కావలిస్తే అన్ని రకాల విషాలు ఆవిడవద్ద ఉంటవి. లేదా సారాబుడ్లు తాగించి, తినరాని కూళ్ళు తినిపించి పాడుచేస్తారేమో? ఎవరు నమ్మను ఈ మిస్సులను? కర్తవ్యం ఏమిటి? పోలీసుకు రిపోర్టుచేస్తే? వ్యవహారం చాలా సీరియస్ అవుతుంది. తనభర్తను అబ్‌డక్టు చేశారంటేనో? అని ఏమిచేసేది? ఆలోచించింది. కల్చరుక్లబ్బు కార్యదర్శినికి జాబుప్రాయ నిశ్చయించింది. తనభర్తను బలాత్కారంగా క్లబ్బు మెంబర్లయిన ముగ్గురు మిస్సులు అపహరించారనీ, ఎక్కడో దాచిపెట్టారనీ, అతడు ఎక్కడున్నాడో తనకు తెలి

యడం లేదనిన్నీ, ప్రాణాపాయం కలిగిందేమోనని అనుమాని మానిస్తున్నాననీ, క్లబ్బుగౌరవం నిలపడంకోసమూ, క్లబ్బు డిసిప్లిన్‌కోసమూ, పబ్లిక్‌గా పోలీసురిపోర్టు పంపకుండా కార్యదర్శినికి ముందుగా తెలియచెయ్యడ మైనదనిన్నీ, వెంటనే తన భర్తను అరెస్టు చేసిన విషయం దర్యాప్తుచేసి ఆ మిస్సులసంగతీ, తన భర్తసంగతీ తెలియజేయ వలసిందనిన్నీ రాసింది. రాసిన ఉత్తరం తెల్లారకుండానే పోస్టులో వేసివచ్చింది. తెల్లారి యింటికి నేను వచ్చేసరికి ఇంతగొడవ చేసినట్లు చెప్పింది. నన్ను చూడ్డంతోనే వటీరావుకు ప్రాణం లేచివచ్చింది.

వాళ్ళేమీ మందులూ, మాకులూ పెట్టలేదుకదా అని విచారించింది. లేనట్లే తోస్తుందని చెప్పాను. రాత్రల్లా యింటికి రాకుండా ఏమి చేస్తున్నారని అడిగింది. యావద్వృత్తాంతం చెప్పమంది.

“అనుకొన్న ప్రకారం సాయంకాలం టీపార్టీ జరిగింది. ముగ్గురుమిస్సులూ, నేనూ మాత్రమే. వాళ్ళు ముగ్గురూ గ్లామరస్‌గా డ్రస్సులు వేసుకొన్నారు. ప్రత్యేకంగా మేకప్ చేసుకొన్నారు.

స్పెంసర్ కంపెనీనుంచి ఆర్డరు ఇచ్చి పదార్థాలన్నీ తెప్పించారు. ఆమాటలూ ఈమాటలూ చెప్పుతూ, నవ్వుతూ, కేరింతాలు కొడుతూ, గంతులువేస్తూ, చప్పట్లుకొడుతూ గోలచేసి

పారేశారు. సాయంత్రానికి పూర్తికావలసిన టీపార్టీ రాత్రి 10 గంటలదాకా జరుగుతూనే ఉన్నది.

"అంతకంటే అల్లరి ఏమీ చెయ్యలేదుకదా."

"అంతకంటే అల్లరి ఏమిటి?"

"యూ సిల్లీ, కిస్సులు వగైరాలు."

"ముగ్గురూ నన్ను లోకువగట్టి సకృత్తుగా కిస్సులు అనుభవించారు. నేనుమాత్రం అలాంటిపని చెయ్యలేదు."

"నిజమేనా?"

"నిజమే"

"అంతేనా"

"అంతే"

"తరవాత"

"రాత్రి పదకొండుగంటలకి టీపార్టీ ముగిసింది. నేను ఖైరయి ఉంటానేమోనని వాళ్ళతోపాటు నాకూ ఏదో మందుయిచ్చింది సూయ."

"ఏం మందో?"

"మందుకాదేమో అనుకొన్నాను. అది పుచ్చుకొన్నాక వళ్ళు వెచ్చబడి దేహానికి చురుకు వచ్చింది."

"చాలా తాగేరా"

"బహు కొద్దిగా తాగా, మిగిలింది వాళ్లు చూడకుండా పారబోశాను."

"తరవాత"

"తరవాత నేను వెడతానని తొందరపడ్డాను. పటీరావు కని పెట్టుకు ఉంటుందనిన్నీ, అనుమానిస్తుందనీ కూడా చెప్పాను. కాని వాళ్ళు నన్ను వెళ్ళనివ్వమన్నారు. కారుమీద షికారుకు రమ్మన్నారు. నేను రానన్నాను. పోనీ కారెక్కమన్నారు. నేను కారెక్కాను. వాళ్ళూ ఎక్కారు. మిస్ హోల్ చక్రందగ్గిర కూచుని కారు నడుపించుకు పోయింది. ఎన్నోమైళ్ళు తీసుకు పోయింది. చివరకి కారు బీచికి తీసుకుపోయింది.

నేను ధుమధుమ లాడుతూంటే క్షమించమని నన్ననేక విధాల వాళ్ళు ముగ్గురూ అనునయించారు. నలుగురము చాలా సేపు సముద్రతీరాన్ని సంచారం సాగించాము. తరవాత స్నానం చేద్దామన్నారు.

నేను బట్టలు తెచ్చుకోలేదు, స్నానం చెయ్యనన్నాను. వాళ్ళు ముగ్గురూ బేతింగ్ సూట్లు వేసుకొన్నారు. నాకోసం కూడా ఒకటి తెచ్చినట్లు చెప్పి నన్ను వేసుకోమన్నారు నేను సందేహిస్తే వాళ్లే నాబట్టలు మార్చడానికి పూనుకొంటామన్నారు. తప్పనిసరిగా నేనూ బేతింగ్ సూటు వేసుకొన్నాను ఒక గంటసేపు సముద్రస్నానం చేశాము.

తరవాత పొడిబట్టలు కట్టుకొని కారెక్కాము. వాళ్ళను సూయ యింటిదగ్గర దిగబెట్టాను. నేను వస్తూంటే టీపార్టీ జ్ఞాప

కార్థం తమకో మెమెంటో పంపమన్నారు. నేను తెల్లారేసరికి ఇంటికి వచ్చాను."

వటీరావు ఆలోచనలో పడింది. తన భర్తను అబ్‌డక్టు చేసినట్లు కార్యదర్శినికి రాసిందికదా! ఇప్పుడేమిటి చెయ్యడం. తానే స్వయంగావెళ్ళి కార్యదర్శినితో మాట్లాడి చిక్కు విడగొడతానంది.

ఊహలు అనే గ్రంథాన్ని ఆవిడే స్వయంగా అందంగా ప్యాక్ చేసి పై పేరు నాచేత వ్రాయించి, టీపార్టీ జ్ఞాపకార్థం అని కూడా వ్రాయించి వాళ్ళకి పంపింది.

౭

లేడీస్ కల్చరుక్లబ్బు యానివర్సరీనాడు సభ్యులందరూ క్లబ్బు హాల్లో సమావేశ మయ్యారు. మిస్సులు ఒకతట్టునా, మెసనులు ఒకతట్టునా కూర్చున్నారు. గ్రామఫోను "ఆడబ్రతుకే మధురం వంటి" సినీమాపాటలు పాడుతోంది. వటీరావు ఆత్రంగా బహుమానంకోసం చూస్తోంది. హాలు, సూయ, లిక్కులు వటీరావు కేసి మిస్ చివస్‌గా చూస్తూ నవ్వుకొంటున్నారు.

కార్యదర్శిని లేచి యీవిధంగా చెప్పింది. "ఈ యేటి బహుమానం ప్రత్యేకంగా మిస్సులకొరకు ఏర్పాటయింది. వారే ఎందుకు బహుమానం యివ్వవలసి ఉంటుందో నిర్ణయం చేసు

కొన్నారు. ఆ నిర్ణయ మిది. ముగ్గురు మిస్సులుచేరి ఒకపురుషుని హృదయాన్ని చూరగొనవలెను. ఆ పురుషుడు క్లబ్బు మెంబరు భర్త అయిఉండవలెను. ఎవరైతే జయప్రదంగా ఆ కార్యం నెర వేరుస్తారో వారికి ఈ వేటి బహుమానం. వారిచేత కాంకర్ చేయబడ్డ భర్తకుకూడా ఒక బహుమానం ఏర్పాటైనది. ఇంతే కాకుండా ఆయన భార్యకుకూడా ఒక కాంసొలేషన్‌ప్రయిజు.

ఈ వేటి బహుమానానికి మిస్సులందరూ ఆరుజట్టులక్రింద విడిపోయారు. అందరూ పాల్గొన్నారు. ఆరుజట్టులలోనూ మూడుజట్టుల మిస్సులు జయప్రదంగా తమకార్యం నిర్వహించ లేకపోయారు. వారికి ఇంకోతడవ జయము చేకూరగలదని క్లబ్బు వారు వారిని ప్రోత్సహించవలసి యున్నది. ఒకజట్టు మిస్సులు ప్రమాదం పాలయ్యారు. వారు ఒకభర్తను వశంచేసుకోబో తుంటే ఆయనభార్య చూడ్డం తటస్థించింది. ఆవిడ బాక్సింగ్ నేర్చుకొన్నది కాబట్టి వాళ్ళతో తక్షణం యుద్ధానికి దిగింది. అందరూ కలబడి కొట్టుకొన్నారు. ఆవిడకూ, ఇద్దరు మిస్సులకూ గాయములైనవి. వాళ్ళపట్ల క్లబ్బువారు సానుభూతి చూపవలసి యున్నది.

ఒకజట్టు మిస్సులు ఒక భర్తను హోటలుకు పిలుచుకుపోయి అతనిచేత సారా తాగించారు. అతడు ఆస్థితిలో ఉండగా ఒక ప్రేమలేఖమీద అతనిచేత దస్కతు చేయించారు. అతని హృద

యం వాళ్ళు చూరగొన్నట్లు నిదర్శనంగా ఆలేఖ చూపుతు న్నారు. మిస్సులు చెప్పే మాటేమిటంటే తాము అతనికి సారా యివ్వలేదనీ, అతడే స్వయంగా ఆ ఉత్తరం వ్రాశాడనీని. ఈ విషయం ఆభర్తకు రిఫర్‌చేస్తే అతడు భార్య ప్రోత్సాహంవల్ల తిరుగుజవాబు వ్రాయలేదు. ఈ కారణాలవల్ల వారికి రెండవ ప్ర యిజు యివ్వడానికి తీర్మానించడమైనది. ఇక మొదటిప్రయిజు సంపాదించిన మిస్ హాల్, మిస్ లిక్, డాక్టరు సూయగార్లను స్సబ్బు అభినందిస్తోంది. వీరు బహు చాకచక్యంగా తమకార్యం నిర్వహించే దన్నందుకు నిదర్శనాలు చాలాఉన్నవి.

ఒకటి—శ్రీ రావుగారి హృదయం చూరగొన్నట్లు ఆయన వీరికి వ్రాసిన ఉత్తరం

రెండు—శ్రీమతి పటీరావు తనభర్తను ముగ్గురు మిస్సులు అపహరించారని నాకు వ్రాసిన రిపోర్టు.

మూడు—శ్రీ రావుగారు తాము రచించిన పద్యకావ్యం ఈ ముగ్గురికీ అంకితం చేయడము.

ఈ కారణాలవల్ల వీరికి ప్రథమ బహుమానం వచ్చింది. శ్రీ రావుగారికి 'హవ్‌టుబి బ్రూటు వన్స వైఫ్' అనే గ్రంథము బహుమానముగా ఇవ్వడమునకున్నూ, శ్రీమతి పటీరావుగారికి "హవ్ టు కీప్ వన్స్ హజ్బెండ్" అనేగ్రంథము బహుమాన ముగా ఇవ్వడమునకున్నూ నిర్ణయించబడ్డది."

బహు వైభవంగా బహుమానాలన్నీ పంచిపెట్టబడ్డవి.

మళ్ళీ కార్యదర్శిని లేచి యీ విధంగా చెప్పింది—"ప్రతీ యానివర్సరీకి యిటువంటి బహుమతు లియ్యడం జీవితానికి మాధురి సంపాదించడము కోసమేగాని, మరెందుకూ కాదు. కాబట్టి ఇట్టి సందర్భాలలో కొన్ని విషమపరిస్థితులు పొడచూపినా మెంబర్లు సద్భావము వదలుకోరని నేనూహిస్తాను.

వివాహితలకూ, అవివాహితలకూ యీమధ్య మనఃస్పర్థలు కలగడానికి కారణాలు ఏర్పడ్డమాట వాస్తవం.

ఇట్టి మనస్పర్థలు పెట్టుకోవడం మనబోటి కల్చరుగల లేడీస్‌కు తగనిపని. కాబట్టి అట్టిస్పర్థలు మరచిపోయినట్లు నిదర్శనంగా వారూ, వీరూ కరస్పర్శలు చేసుకోవలసిందని నేను కోరుతున్నాను."

నవ్వుల కలకలలో, చీరల చప్పుళ్ళలో కరస్పర్శలు సక్రమంగా జరిగినవి. క్లబ్బుకు నూతనకళ వచ్చింది.

ఇక జాతీయగీతం అంది కార్యదర్శిని.

అందరూ ఒక్క గొంతుకతో మధురంగా పాడారు.

"నమో హిందుమాతా, సుజాతా, నమో జగన్మాతా!"